## కావలి పోలీసు

మొదటి పేజీ తరువాయి

కడుపు మంట కల్గించినట్లుంది. కావలిలో ఏదో యుద్ధం జరుగుతున్నట్లు వందలాది మంది పోలీసులను మొహరించి సభకు జనం వెళ్లకుండా భయపెట్టడం మొదలు పెట్టారాయన. ఆ పోలీసు దౌర్జన్య దృశ్యాలు మితి మీరి పోవడంతో తేజ టివికి చెందిన విలేఖరి శ్రీను తన కెమరాతో ఆ దృశ్యాలు చిత్రీకరించబోయే సరికి సిఐ సుబ్బారెడ్డి గారు అతడిపై విరుచుకపడి, దౌర్జన్యంగా కెమరా పెరుక్కున్నాడట. ఆ విలేఖరితో పాటు కెమెరా మెన్ చుట్టుప్రక్కల జనం కూడా ఇదేమి దౌర్జన్యం అని ప్రశ్నించేసరికి, ఇన్స్‌పెక్టర్ గారికి కోపం కట్టలు తెంచుకుందట. దానితో ఆ విలేఖరితో పాటు, ప్రక్కనే వున్న మరొక విలేఖరిని కూడా లాఠీలతో చితక కొట్టాడట. ఇన్స్‌పెక్టర్ గారు ఒక్కడే లాఠీలతో కష్టపడడంచూసి ఓర్చుకోలేక పోలీసులు కూడా రంగంలోకి దిగి విలేఖరులిద్దరిపైనా ప్రతాపం చూపించారు. ఆ దెబ్బలకు శేఖరబాబు అనే విలేఖరికి ఒళ్లంతా కదుములు కట్టి పోయింది.

బహిరంగ సభ దగ్గరున్న తతిమా విలేఖరులకు ఈ విషయం తెల్సి, ఇన్స్‌పెక్టర్ వద్దకు వచ్చి ఈ దౌర్జన్యం పట్ల నిరసన తెలిపారు. అది ఆయనలోని మృగాన్ని మరింతగా రెచ్చగొట్టింది; నాకే నీతులు చెప్తారా అని ఆ విలేఖరుల బృందంపైకి కానిస్టేబుళ్లను వుసి గొల్పాడట. వారు విలేఖరులను ఒక కిలో మీటరు వరకు వీధులలో తరిమి తరిమి కొట్టారట.

ఏమిటీ దౌర్జన్యం? ఎవడా సర్కిల్ ఇన్స్‌పెక్టర్? అతడు అంత దుర్మార్గంగా ప్రవర్తిస్తుంటే ప్రక్కనే వున్న డిఎస్పీ ఎందుకు నివారించలేక పోయారు? ఇన్స్‌పెక్టర్‌ను ప్రేరేపించింది డిఎస్పీ యేనా? బహిరంగ సభను కాని, పోలీసు బందోబస్తు దృశ్యాలను కాని కెమెరాలో చిత్రీకరించడం నేరమా? ఏ చట్టం ప్రకారం అది నేరం? విలేఖరులను కొట్టడానికి, తరుముకోవడానికి, దుర్భాషలాడడానికి పోలీసుకు అధికారం ఎవరిచ్చారు? అసలు వారంతగా పిచ్చి పట్టినట్లు ప్రవర్తించడానికి కారణం ఏమిటి?

వీటన్నిటికీ సమాధానం చెప్ప వల్సిన వాడు ఎస్పీ గారు; కాని తస్లీమా బాను చావు సమయంలో కావలి పోలీసు చెప్పిన తప్పుడు సమాచారాన్ని విశ్వసించి అది ఆత్మహత్యేనని, అనుమానం వుంటే ప్రైవేట్ డిటెక్టివ్‌ల చేత దర్యాప్తు చేయించుకోవచ్చునని ప్రకటించిన ఎస్పీ గారు ఈ దౌర్జన్యం విషయంలోనూ కావలి పోలీసు అసత్యాలనే విశ్వసిస్తున్నారు. అక్కడ జరిగింది చాలా చిన్న సంఘటన అని, ఆ ఇన్స్‌పెక్టర్ చేత విలేఖరులకు క్షమాపణ చెప్పిస్తే సరిపోతుందని ఆయన జిల్లా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి వివరణ ఇచ్చారట. ఆయన వివరణ పుండు మీద కారం చల్లినట్లుగా వుంది. ఒక విలేఖరిని నడివీధిలో అకారణంగా చావకొట్టడం, స్వల్ప సంఘటన అవుతుందా?

ఎస్పీ గారు చెప్పినంత మాత్రాన అది క్షమాపణతో సరిపెట్టదగిన నేరం కాదు. తమ వికృత చర్యల ద్వారా కావలి పోలీసు తస్లీమా బాను కేసులో నిజంగానే తప్పు చేసినట్లు చాటి చెప్పారు. ఆ నేరం కప్పి పుచ్చుకోవడానికి, ఆ నేరాన్ని బయట పెడుతున్న వారిపై దౌర్జన్యం చేస్తున్నారు. చట్ట ప్రకారం రక్షణే కాకుండా, సమాజ పరంగా కూడా భద్రత కల్గిన పత్రికా విలేఖరుల పట్లనే పోలీసు ఇంత క్రూరంగా వ్యవహరించగల్గుతున్నారంటే - ఇక ఆ కేసులో సాక్షులను ఇంకెంత దారుణంగా అణిచి పారేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇటువంటి దగుల్బాజీ పోలీసు అధికారుల తప్పులకు క్షమాపణ ప్రాయశ్చిత్తం కాబోదు. విలేఖరులను కొట్టిన ఇన్స్‌పెక్టర్, అతడికి సహకరించిన డిఎస్పీలపై క్రిమినల్ కేసులు దాఖలు చేసి ప్రాసిక్యూట్ చేయించడం ఎస్పీ గారి కర్తవ్యం. తన శాఖ సిబ్బంది ఏ తప్పు చేసినా దాన్ని ఒప్పుగా మార్చే సహజ పోలీసు మనస్తత్వంతో ఈ దౌర్జన్యాన్ని కూడా కప్పి పెట్టడానికి ఆయన ప్రయత్నిస్తే విలేఖరుల సంఘాలు ఆందోళన చేపట్టక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. ఎస్పీ గారు తెగించడా తాడు లాగవారనే ఆశిద్దాం.

## రాజకీయం

మొదటి పేజీ తరువాయి

లోని పలు ఇతర చోట్ల కూడా విత్తనాల కోసం రైతులు యుద్ధం చేయవలసి వస్తున్నది. తెలంగాణా జిల్లాలలో ఈ పోరాటం మరీ ముమ్మరంగా వుంది. విత్తనాలు ఇస్తామని చెప్పడం తప్ప అందుకు తగిన ఏర్పాట్లు చేయకపోవడం వల్లనే ఈ పరిస్థితి. చేవెళ్ల దుర్ఘటన తర్వాత ముఖ్యమంత్రి ఒక ప్రకటన చేస్తూ అందరు రైతులకు వారు కోరిన విత్తనాలు ఇవ్వలేమని నిస్సహాయత వ్యక్తం చేశారు. ఎందరికి ఇవ్వగలరో మాత్రం చెప్పలేదు. విత్తనాల అవసరం వ్యవసాయ సీజన్ ప్రారంభంలో మాత్రమే ఉంటుంది. వానలు పడగానే సీజన్ మొదలవుతుంది. అదును తప్పిన తర్వాత ఊరికే ఇచ్చినా రైతులకు దండగే. గత పది రోజుల నుంచి తెలంగాణా జిల్లాలలో చెదురు మదురుగా వానలు పడుతున్నాయి. అందువల్లనే రైతులు విత్తనాలకు తం దరపడుతున్నారు. రెండేళ్ల నుంచి కరవుతో అల్లాడుతున్న రైతాంగానికి విత్తనాల ఖర్చులో సగం తగ్గినా పెద్ద ఉపశమనమే. ఆ ఆశతో వారు అధికారుల దగ్గరకు వస్తుంటే పోలీసులను పెట్టి చావబాదించడం ఈ ప్రభుత్వ కర్శక ప్రవర్తనకు నిదర్శనం. చేవెళ్లకు వై.ఎస్. రాజశేఖర రెడ్డి, టి.ఆర్.ఎస్. చంద్రశేఖరరావు వంటి ప్రతిపక్ష నేతలు వెళ్లి ఆందోళన హెచ్చరికలు చెయ్యడంతో రైతులను మరొకసారి మోసపుచ్చడానికి వడ్డీ మాఫీ నిర్ణయం ప్రకటించాడు ముఖ్యమంత్రి.

రైతుల జీవితాలతో ఈ రాజకీయ క్రీడలు క్షమార్హం కావు. ప్రభుత్వానికి రైతుల మీద నిజంగా ప్రేమ వుంటే వారి సమస్యలు తెలుసుకొని ఒక కార్యాచరణ ప్రణాళిక ద్వారా పరిష్కారానికి ప్రయత్నించాలి. అంతే తప్ప తమకు రాజకీయం అవసరం ఏర్పడినప్పుడల్లా ఆలోచన లేకుండా ఏదో ఒక సహాయం ప్రకటించడం; అది నెరవేర్చడం చేతగాక చతికిలబడడం సరైన పద్ధతి కాదు. ఇప్పటికైనా కళ్లు తెరిచి, చేవెళ్ల వంటి దుర్ఘటనలు మరొకసారి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత. రైతులకు మేలు చేయక పోతే పోయారు వారి రక్త తర్పణంతో రాజకీయం చేసే నీచ ప్రవర్తననైనా మానుకో గలిగితే రైతాంగం తన మానాన తాను బ్రతుకుతుంది.

## నిపుణుడు

మొదటి పేజీ తరువాయి

జనరల్స్‌తోపాటు ఇద్దరు న్యాయమూర్తుల పైన తీవ్రమైన 'వ్యాఖ్యలు చేస్తే ఎవరికి వారు దొంగకు తేలు కుట్టినట్లు వుండి పోవడం చాలా దురదృష్టకరం. మన న్యాయ పాలనావ్యవస్థలు, వాటి నిర్వాహకులు ఎంతగా దిగజారిపోయారో, సిగ్గు విడిచారో దీన్ని బట్టి అర్థం అవుతుంది. ఈ వ్యాఖ్యలపై ఏమాత్రం స్పందన చూపినా తమ లోగుట్టులన్నీ ప్రజల చర్చకు వస్తాయన్న భయంతోనే ఈ విమర్శల అవమానాన్ని దిగమింగుకున్నారు వారు. ఎంత దగుల్బాజీతనం?



